క్లుప్తంగా

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



నల్లబెల్లి : భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణపతి నవరాత్రులు నిర్వహించే ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ రూపొందించిన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట, అసభ్యకరమైన నృత్యాలు నిషేధమని స్పష్టం చేశారు. మండపాల వద్ద అనుమానస్పద వ్యక్తులు, బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పెద్దూరి రాజ్‌కుమార్



వర్ధన్నపేట : బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పెద్దూరి రాజ్‌కుమార్‌ను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాజ్‌కుమార్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. తనకు పదవి కట్టబెట్టడంతో బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సన్మానం



పర్వతగిరి : పారాలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జీవంజి దీప్తి కాంస్య పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కల్లెడలో ఆమె తల్లిదండ్రులు యాదగిరి–లక్ష్మిని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, నాయకులు చింతకుంట్ల మల్లికార్జున్, ముదురుకోల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.825కే విద్యుత్ కనెక్షన్

పర్వతగిరి : ఎస్సీ, ఎస్టీలకు రూ.825కే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ అమర్చుతామని ఆ శాఖ ఏడీఈ చంద్రమౌళి తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీలకు ఈనెల 15వ తేదీ వరకు అక్కడికక్కడే విద్యుత్ కనెక్షన్ ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. కొత్తగా కనెక్షన్ తీసుకున్న వారికి ఈనెల నుంచే గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోగా రూ.825 చెల్లించి విద్యుత్ కనెక్షన్ పొందాలని చెప్పారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రాకం రాకేశ్ విమర్శించారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడచినా విద్యాశాఖ మంత్రిని నియమించలేదని మండిపడ్డారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో నాయకులు ఉదయ్, అరుణ్, వెంకటేశ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీడీపీఓ మృతి



రాధిక (ఫైల్)

నర్సంపేట : నర్సంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రాధిక (55) హనుమకొండ గోపాలపురంలోని ఆమె స్వగృహంలో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. మృతురాలు రాధికకు భర్త, కుమారుడు ఉన్నారు. ఆమె మృతికి పలువురు నివాళులర్పించారు.

బియ్యం సాయం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన పున్నం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంది కృష్ణచైతన్య బుధవారం వేర్వేరుగా కలిసి 50 కిలోల చొప్పున బియ్యం సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని గోపాల్ నాయక్, కృష్ణచైతన్య పరామర్శించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య, మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు బండి పద్మ, నాయకులు ఎనగందుల జయందర్‌రెడ్డి, కోల విజయ్, వీరభద్రయ్య, మెంతుల రమేశ్, చెవ్వ వెంకటేశ్వర్లు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై ఎప్పటికప్పుడు సమీక్షించండి

● నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి

ఖానాపురం : వరదల నేపథ్యంలో చెరవులు, కుంటల వద్ద పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి సూచించారు. మండలంలోని అశోక్ నగర్‌లో లోలెవల్ కల్వర్టు, పాకాల సరస్సును బుధవారం ఆమె సందర్శించి ప్రధాన తూములతోపాటు మత్తడి ప్రదేశాలు పరిశీలించారు. లోలెవల్ కల్వర్టు వద్ద వరద ఉధృతిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరస్సులోకి ఎవరూ వెళ్లకుండా చూడాలని, కల్వర్టుపై వరద తగ్గే వరకు ప్రయాణాలు నిలిపేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలో కూలిన ఇళ్లను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భారతి సందర్శించి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి నష్టాన్ని అధ్యయనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.



ఖానాపురం : కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని ఇళ్లలోకి వరద నీరు చేరగా పంచాయతీ కార్యదర్శి ముక్కెర ఆనంద్, సిబ్బంది సందర్శించి పరిశీలించారు. ఇళ్ల నుంచి ఖాళీ చేయించారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో పునరావాసం కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఆనంద్ మాట్లాడారు. శిథిలమైన ఇళ్లలో ఎవరూ ఉండొద్దని చెప్పారు.



పర్వతగిరి : బాధితులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ

ఫీడర్ చానల్ కట్టకు మరమ్మతు చేయిస్తాం



కట్టను పరిశీలిస్తున్న సత్యనారాయణ తదితరులు

వర్ధన్నపేట : మండలంలోని కోనారెడ్డి చెరువుకు కోనాయచలిమ నుంచి వచ్చే ఫీడర్ చానల్ కట్ట తెగిన నేపథ్యంలో త్వరలో మరమ్మతు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని బండౌతపురం సమీపంలో ఫీడర్ ఛానల్‌కు ఉన్న తెగిన కట్టను ఆయన ఆధ్వర్యంలోని బృందం బుధవారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. తెగిన కట్టకు మరమ్మతు చేయించేలా సమస్యను ఎమ్మెల్యే నాగరాజుకు వివరిస్తామని చెప్పారు. కట్ట తెగిపోవడంతో ఆకేరు వాగు వద్ద ఉన్న కోనాయచలిమ అక్విడేట్ నుంచి నీటి వరద రావడం లేదని, తద్వారా కోనారెడ్డి చెరువు నిండలేదని తెలిపారు. యుద్ధప్రాతిపదికన కట్టకు మరమ్మతు చేయించి కోనారెడ్డి చెరువుకు ఆకేరు వాగు నీరు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పోశాల వెంకన్న, సాయికుమార్, దశరథం, గుంటి కుమారస్వామి, పాలకుర్తి సారంగపాణి, జక్కుల రాములు, చిన్నాల రాజు, దామె రాజు, బొజ్జల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై సర్వేపల్లి





చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ ఉపాధ్యాయురాలు కాచవరపు సంధ్య చాక్‌పీస్‌పై బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని గీశారు. ఉపాధ్యాయులకు గుర్తింపునిచ్చిన రాధాకృష్ణన్ చిత్రాన్ని చాక్‌పీస్‌పై గీసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ముళ్లచెట్లు ఇలా.. రాకపోకలు ఎలా..?



రాయపర్తి : మండలంలోని గట్టికల్–పెర్కవేడు గ్రామాల మధ్యన ఉన్న రహదారిపై ముళ్లచెట్లు పొదలను తలపించేలా ఏపుగా పెరిగిన క్రమంలో రాకపోకలు ఎలా సాగించాలని వాహనదార్లు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు ముళ్లచెట్లు పూర్తిగా రోడ్డు మధ్యలోకి వేలాడుతూ ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్లచెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన రోడ్లతో ఇబ్బందులు



చెన్నారావుపేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు రోడ్లు కోతలకు గురై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నారావుపేట శివారులోని పెద్ద మోరి సమీపంలో కోపాకుల చెరువు వరద ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. అలాగే లింగగిరి నుంచి నెక్కొండకు వెళ్లే రోడ్డు సైతం ఇకవైపు భారీగా కోతకు గురై భయంకరంగా దర్శనమిస్తోంది. కోతకు గురైన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టడంతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అవగాహనతో పథకాల సద్వినియోగం

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు వినియోగించుకోగలరని తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ తెలిపారు. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం ప్రజలకు ఆటపాటలతో అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీలతో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. ఈగలు, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి సభ్యులు యోజన తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగల రవీందర్, రమేశ్, నవీన్, సూరయ్య, భాస్కర్, కుమారస్వామి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుమన్

పేదలకు సాయం చేయడమే ధ్యేయం

● 'ఎస్‌ఆర్‌ఆర్' సంస్థల అధినేత శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : పేదలకు సహాయం చేయడమే ధ్యేయంగా ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఆర్‌ఆర్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌తో కలిసి శ్రీనివాస్‌రెడ్డి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గట్టికల్‌లో చేపట్టిన సవార్ లచ్చమ్మ ఆలయ నిర్మాణానికి రూ.30 వేల విరాళం అందజేశారు. అనంతరం రాగన్నగూడెం, తిర్మలాయపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు క్వింటా చొప్పున బియ్యంతోపాటు నూనె, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే తిర్మలాయపల్లి కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయకు మోటర్, స్టార్టర్‌లను అందజేశారు. అలాగే ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతుకు డబ్బు అందించి ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు లేతాకుల మధూకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కోల సంపత్, గోవర్ధన్‌రెడ్డి, సందిదేవేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గబ్బెట పెద్దబాబు, వెంకటమల్లు, దాసరి వెంకన్న, దాసరి శ్రీను, సమ్మయ్య, రాజబాబు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ముదిరాజ్ వృత్తిదారులకు అపారనష్టం

● మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్

చెన్నారావుపేట : ఎడతెరిపి లేని వర్షాలకు చెరువులు తెగి ముదిరాజ్ వృత్తిదారులకు అపారనష్టం వాటిల్లిందని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వృత్తిదారులు కట్టలు తెగి చెరువుల్లోని చేప పిల్లలు నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వం సర్వే చేయించి బాధితులకు నష్టపరిహారం అందించడంతోపాటు చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దండు చిరంజీవి, సింగారం రామకృష్ణ, నీరటి రాజు, పెండ్యాల కృష్ణ, శ్యామ్, వినయ్, గణేశ్, చేరాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

వరద బాధితులను సత్వరమే ఆదుకోవాలి



నర్సంపేట : అకాల వర్షాల నేపథ్యంలో వరదతో నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవాలని బీజేపీ నర్సంపేట కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కంభంపాటి ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలకు రైతులు పంటలు నష్టపోగా, ప్రజలు ఆస్తులు కోల్పోయారని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున, ఇళ్లు కూలిన వారికి తగిన రీతిలో పరిహారం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడానికి వ్యవస్థ లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద అందించిన రూ.1300 కోట్లను, రూ.200 కోట్ల యూపీ నిధులను ఖర్చు చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సహాయం చేయడానికి సిద్ధంగా ఉండగా కనీసం నివేదిక కూడా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.

ఎమ్మెల్యే బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి

నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బలపర్చిన అభ్యర్థులను యూత్ కాంగ్రెస్ ఎన్నికలో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల రమాకాంత్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ఐవైసీ యాప్ ద్వారా నిర్వహించనున్నట్టు తెలిపారు. మెంబర్‌షిప్, ఓటింగ్ విధానాన్ని వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శివచరణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా పరమేశ్, నియోజకవర్గ అధ్యక్షుడిగా సందీప్, మండల అధ్యక్షుడిగా పురుషోత్తం సురేశ్ బరిలో నిలవగా వారిని ఎమ్మెల్యే బలపర్చినట్టు తెలిపారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బేతి భరత్, కాంగ్రెస్ పార్టీ నల్లబెల్లి అధ్యక్షుడు బత్తిని మహేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు డ్యాగల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా హరీశ్‌ను..

చెన్నారావుపేట : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బరిలో నిలచిన బండి హరీశ్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ నాయకుడు కన్నం సందీప్ కోరారు. మండలంలోని పాపయ్యపేట, అమృతండా గ్రామాల్లో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐవైసీ, ఏపీపీ మెంబర్‌షిప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, వెంకన్న, బోడ ప్రవీణ్, కృష్ణ, విజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయండి

గీసుకొండ : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ఊకల్‌లో బుధవారం చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఊరచెరువును అధికారులతో కలిసి సురేశ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కమలాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఓ చంద్రకాంత్, నిమ్మల శేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

నర్సంపేట రూరల్ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రైతు సంఘం జిల్లా నాయకుడు కేశెట్టి సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట శివారులో నేలవాలిన పంటలను రాజమౌళి, సదానందం ఆధ్వర్యంలోని బృందం బుధవారం పరిశీలించి అధ్యయనం చేసింది. అనంతరం రాజమౌళి, సదానందం మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలకు పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, తదితర పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించి బాధితులకు సత్వరమే పరిహారం అందే దిశగా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనుమాల రమేశ్, గుర్రం రవి, దండు సమ్మయ్య, కందికొండ సాంబయ్య, బడ్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



అనురాధ



సాబిహా భాను

రాయపర్తి : విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతూ పాఠశాలలో పచ్చదనం పెంపొందించారు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కొంక అనురాధ. ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్‌కోర్) ఇన్‌చార్జ్‌గా విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను పెంచడంతోపాటు (కిచెన్‌గార్డెన్) కూరగాయలను పండించి మధ్యాహ్న భోజన తయారీకి ఉపయోగిస్తూ ఆమె జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. ఉదయం 20 నిమిషాల ముందే పాఠశాలకు రావడం, సాయంత్రం విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిన తర్వాతే ఆమె ఇంటికి వెళ్తారు. తల్లిదండ్రులతో సంబంధాలను కొనసాగిస్తూ విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చేలా కృషిచేస్తున్నట్లు ఉపాధ్యాయురాలు మాధవి చెప్పారు. ఇందుకు 2024 జూన్‌లో నేషనల్ గ్రీన్ చాంపియన్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాల పాఠశాల చరిత్రను తెలుసుకునేందుకు సావనీర్ ముద్రించినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులతో డోనర్ అకౌంట్‌ను తెరిపించి రూ.7 లక్షలను బ్యాంకులో జమచేసినట్లు వివరించారు.

షేక్‌సాబిహ భానుకు..

నల్లబెల్లి : మండలంలోని నందిగామ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు షేక్ సాబిహభాను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమెను పలువురు అభినందించారు.

బాలికల్లో చైతన్యమే లక్ష్యంగా సంఘాలు

చెన్నారావుపేట : కౌమార దశలో ఉన్న బాలికల్లో చైతన్యం నింపడమే ధ్యేయంగా వారితో సంఘాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్టు ఎంపీడీఓ నల్ల శ్రీవాణి తెలిపారు. మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 15 నుంచి 18 ఏళ్ల వరకు వయస్సున్న బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌమార దశలో బాలికలకు అనేక విషయాలను తెలియజేయాల్సిన బాధ్యత ఫెసిలిటేటర్‌గా వీఓఏల మీదే ఉందన్నారు. బాల్యవివాహాలు, అసమానతలు, తదితర అంశాలపై సామాజిక స్పృహ కల్పించేలా అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేయాలని చెప్పారు. సంఘాలు బాలికల మానసిక వికాసానికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఏపీఎం ఈశ్వర్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్, సఖి సంస్థల ప్రతినిధులు హర్షిత, తిరుమల మాట్లాడారు. తదనంతరం స్నేహ సంఘాల ఏర్పాటు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీలు కట్టయ్య, సుజాత, మంజుల, శ్రీలత, వీఏఏలు ఆస్మా, సుధ, పర్వీన్, మంజుల, శ్యామ్, ప్రభాకర్, కుమారస్వామి, సిబ్బంది రజిత, ఉమ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

విధుల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

పర్వతగిరి : విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పల్లెల్లో టాంటాం వేయించాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటితే తాగాల్సిన అవసరాన్ని అర్థం చేయించాలని తెలిపారు. ఇనుప దండెలు, కరెంటు స్తంభాలను ప్రజలు ముట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులు, వాగుల్లోకి చేపలు పట్టే వారిని వెళ్లకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. శిథిలమైన ఇళ్లలో ఉన్న వారిని రక్షిత ప్రదేశాలకు తరలించాలని, నీటి నిల్వలున్న చోట ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్, లైన్‌మెన్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ గ్రూపుగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సునీల్‌కుమార్, ఈసీ రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసూన

సంగెం : పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. మండలంలోని గవిచర్లలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారం లోపిస్తే ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఫ్రాన్సిసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యశోద, లత, వెంకటమ్మ, ఆశ కార్యకర్తలు సంధ్యారాణి, రజిత, రమ, జ్యోతి పాల్గొన్నారు.

వర్షాకాలం సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

నల్లబెల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్థానిక వైద్యాధికారి పోరిక రవీందర్ నాయక్ కోరారు. మండలంలోని కన్నారావుపేటను వైద్య సిబ్బందితో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. సబ్ సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికున్ గున్యా, తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బందితో కలిసి పారబోశారు. ఇంటి ఆవరణల్లో నీటి నిల్వల్లేకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సబ్ సెంటర్‌కు వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అభిషా, ఏఎన్‌ఎం లావణ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ రవీందర్

మట్టి విగ్రహాలతో జీవవైవిధ్య పరిరక్షణ

రాయపర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మట్టితో తయారు చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేయడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు బాటలు వేయాలని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఆజ్మీరా ఉమాదేవి ఆధ్వర్యంలో 'మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం–జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం' అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి అతిథిగా భాస్కర్‌రావు హాజరై మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితమై జీవరాశికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. జీవవైవిధ్యమూ దెబ్బతింటుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రజలు మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, రవీందర్, లత, జ్యోతి, మమత, రమేశ్, సౌజన్య, ప్రమోదిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రావు